---లాటి టైటిల్స్ పెట్టి సంపాదకీయాలు వ్రాయబడ్డాయి. ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ఇలాంటి బెదిరింపులకు లొంగకూడదని, ఒకసారి దీనికి తలవొగ్గితే ప్రతిసారీ యిది అలవాటు అయిపోతుందనీ ఒక దినపత్రిక మరీ ఘాటుగా విమర్శించింది. ప్రతిపక్షాలు కూడ టెర్రరిష్టుల చర్యని అభిశంసిస్తూ తీర్మానాలు చేశాయి. రాష్ట్రమంతా అట్టుడికి పోయింది.

అధికారపార్టీ కార్యకర్తలు నగరంలో పలుచోట్ల చేరి మ్యుఖ్యమంత్రికి అండదండలు ప్రదర్శిస్తూ ఊరేగింపులు జరిపారు. రాష్ట్రం ఉద్రికత్తతో నిండింది. వార్త దూరదర్శన్‌లో ప్రసారం కాగానే దేశంలో మిగతా రాష్ట్రాల నాయకులు కూడా తీవ్రమైన చర్చలు జరిపారు. దేశంలోనే కాదు -- ప్రపంచ చరిత్రలోనే మొట్ట మొదటిసారి జరుగుతున్న కొత్తరకపు ఘాతుకం యిది. ఒక రాష్ట్రపు సుస్థిరమైన ప్రభుత్వాన్ని ఇంత సులభంగా మార్చవచ్చుననే ఆలోచన రావటమే గొప్ప. ఆ హార్డ్ కోర్ టెర్రరిస్టుని గూఢచారి ఎలా పట్టుకుంటుందో అని ప్రతి వాడిలోనూ సంధిగ్దతే. నమ్మకం కూడా లేదు. రేపటి కోసం ప్రతివారూ ఎదురు చూడసాగాడు - ఆసక్తితో.

పాతికమంది పిల్లల తాలూకు తల్లిదండ్రులకు మాత్రం నిద్రాహారాలు లేవు. పగలు - రాత్రి అన్న భేదం లేకుండా కంట్రోల్ రూమ్ దగ్గిర పడిగాపులు గాస్తున్నారు. ఏ క్షణం ఏ వార్త వస్తుందో అన్న దిగులుతో ఆ మెట్లమీద కూలబడి వున్నారు. మొహాలు పీక్కుపోయాయి. కొంతమంది తల్లులు ఏడుస్తున్నారు. మగవాళ్ళు పైకి బింకంగా వున్నారు. గుంపులు గుంపులుగా మాట్లాడుకుంటున్నారు. కొంతమంది పోలీసుల అసమర్థతని తిడుతూ వుంటే, మరికొంతమంది ప్రతిపక్షాలని తిడుతూవున్నారు.

మరుసటిరోజు సాయంత్రం అయిదయింది.

పేరెంట్స్ టెన్షన్ ఎక్కువయింది.

సి.బి.ఐ. చీఫ్, డిప్యూటీ, మిగతా ఆఫీసర్లు టెలిఫోన్స్ దగ్గర కూర్చుని వున్నారు. ముఖ్యమంత్రి తాలూకు అన్ని ఫోన్లకి రికార్డ్ కనెక్షన్ ఇవ్వబడ్డాయి. నగరంలో అన్ని పబ్లిక్ ఫోన్‌ల దగ్గరా మఫ్టీలో ఆఫీసర్లు వున్నారు. క్షణాలమీద బయలుదేరటానికి వ్యాన్లు, జీపులు, కార్లు సిద్ధంగా వున్నాయి.

అవతలి వారినుంచి వచ్చే ఫోన్‌కోసం ప్రాణాలు బిగపట్టుకొని కూర్చున్నారు అందరూ టెర్రరిస్టులు ఏంచెపుతారో వినటం కోసం .....

నాలుగూ యాభై అయింది.

అయిదయింది.

అయిదు గంటల అయిదునిమిషాలయింది.

*   *   *   *   *

"మాటిమాటికీ ఫోన్‌లు చేయటం గడువు కొద్దిగా పెంచటం, రాయబారాలు నడపటం - ఇవన్నీ పాత పద్ధతులు అనుకున్నది అనుకున్నట్టు సాగించండి" చెప్పాడు అనంతానంతస్వామి.

పసిపిల్లల్ని కాల్చాలంటే......"

అనంతానంతస్వామి అతడివైపు చిత్రంగా చూశాడు. తర్వాత నవ్వేడు. "పసివాడిదయినా, పెద్దవాడిదయినా ప్రాణం ప్రాణమే. ఎవరిని చంపినా ఒకటేపాపం. ఒకర్ని గద్దె దింపుతామని మనం వేరొకరికి వాగ్దానం చేశామ. కోటి రూపాయలకి ఒప్పుకున్నామ. ఇప్పుడు పసిపిల్లలు, జాలి, అని సాకులు చెప్తే ఎలా? ..... ఎవరున్నారు ఆ పిల్లల దగ్గిర?"

"A-1,A-2 , A-4"

"నేనే వస్తానక్కడికి. ఈ లోపులో పని పూర్తిచేయి, వెళ్ళు."

రామ్‌లాల్ వెళ్ళాడు.

అతడు నరరూప రాక్షసడు. దేశంలోకెల్లా భయంకరమైన టెర్రరిస్టు- కానీ అతడికి ఒకటే బలహీనత. చిన్నపిల్లల్ని ఏమీ చెయ్యలేడు. కావాలంటే భార్యను కూడ నరికి పోగులు పెట్టగలడు. వందమందిని కట్టగట్టి కిరసనాయిలు పోసి తగులబెట్టగలడు కాని ..... అతడికీ ఆ వయసున్న కొడుకులిద్దరున్నారు. వాళ్ళంటే ప్రాణం. అదో సెంటిమెంటు.

అనంతానంతస్వామి వెళ్ళేసరికి పరిస్థితి అలాగే వుంది.

"ఏమిటి ..... చంపటానికి చేతులు రావడం లేదా?" నలుగురూ మాట్లాడలేదు.

"ఆనాడు అర్జునుడికి కృష్ణుడు భగవద్గీత బోధించినట్టు మీకు ఆధునిక జీవిత సారాన్ని బోధించాలని వుంది. 'ధర్మ క్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః- మమకాః పాండవాళత్చవ కిమకుర్వతసంజయ? అని వాదించాలని ఉంది. కాని టైమ్‌లేదు. మనం పెట్టిన గడువు దాటి పోయి అయిదు నిముషాలైంది. పిల్లలెక్కడ?

రామ్‌లాల్ గుట్టమీద పాడుపడిన ఇంటిని చూపించాడు. దానికి పైకప్పులేదు. లోపల పాతికమంది దాకా పిల్లలున్నారు. కొందురు ఏడుస్తున్నారు. కొందరు శోషవచ్చి పడిపోయి ఉన్నారు. అక్కడ గది గోడల మధ్యనుంచి రావిమొక్కలు మొలచి వున్నాయి. గచ్చుమీద గడ్డి, పెంటవుంది.

విష్ణు నోట్ పుస్తకాల్లోంచి ఒక్కొక్క కాగితమే చింపి గాలివాటు చూసి విసురుతున్నాడు. వాడి చిన్న మెదడుకి అంతకన్నా పెద్ద ఆలోచన తోచలేదు. పిల్లలు బొద్దుగా వున్నారు. కానీ కొన్ని గంటలనుంచి ఏమీ తినక పోవటంవల్ల ఆ చిన్ని ప్రాణాలు తల్లడిల్లిపోతున్నాయి. ఏడవటానికి కూడ ఓపికే లేదు. ఆ చిన్ని ప్రాణాల వయసు ఎంతని? వారికి రక్తపాతాలు గురించీ, మనుషుల కిరాతక స్వార్థం గురించీ, రాజకీయాల గురించీ ఏమీ తెలియదు. ప్రపంచం అంతా మంచితనమే అని నమ్మే వయసు వారిది గాంధీ, నెహ్రూల గురించి మాత్రమే తెలుసు.

విష్ణు తను చేస్తున్న పని ఆపి. "ఒరేయ్ వినీల్? నీ దగ్గిర చాక్లెట్‌లు వున్నాయ్ కదరా" అన్నాడు.

వినీల్ తలూపాడు.

వున్నవాడు విష్ణు ఒక్కడే. హుషారు చేస్తున్నాడు. ఇంట్లో కోయవలసిన కేకు ఎదురుచూస్తూ వుండగా, ఇక్కడ వినీల్ ఒక్కొక్క కుర్రాడి దగ్గిరకి వెళ్ళి చాక్లెట్లు పంచుతున్నాడు.

"వినీల్‌కి హేపీబర్త్‌డే చెప్పండ్రా."

పిల్లలందరూ ముక్తకంఠంతో అన్నారు -

'హేపీ బర్త్‌డే టూ యూ వినీల్-" ఆ లేత స్వరాల ప్రకంపనలు తరంగాలుగా వ్యాపించాయి. గోడమధ్య మొలిచిన రావిమొక్క దిగులుగా వూగుతోంది. ఆకాశం మేఘావృతమై వుంది.

"మెనీ రిటర్న్స్ ఆఫ్ ది డే టు వినీల్" కోరస్‌గా పిల్లలు అన్నారు. కళ్ళనీళ్ళు మధ్య మెరుపంత సంతోషం ..... విషాదం మధ్య రవ్వంత చిరునవ్వు ఆ పసివాళ్ళ మొహాల్లో అమాయకంగా కదలాడింది.

అప్పుడు ప్రవేశించాడు అనంతానంతస్వామి అక్కడికి. లేళ్ళ గుంపుని చూసిన మృగంలా వాళ్ళ వైపు కొద్దిక్షణాలు తేరిపార చూసాడు. చిరునవ్వుతో అడిగాడు--

"నీ పేరేమిటి?"

"వినీల్"

"ఏం చదువుతున్నావు?"

"ఆరో తరగతి"

అనంతానంతస్వామి చాలా పొడుగు. వినీల్ తలపైకెత్తి మాట్లాడు తూంటె వర్షపు చుక్క ఒకటి వాడి కంటి అద్దంమీద పడింది. తుడుచుకున్నాడు. స్వామి వాడి భుజంమీద చెయ్యివేసి బయటకు తీసుకువెళ్ళాడు. మిగతా ముగ్గురు టెర్రరిస్టులూ లోపలే ఉన్నారు. బైట సంభాషణ లోపలికి వినిపిస్తోంది.

"మీ స్కూల్లో ప్రేయర్ ఏం చేస్తార్రా వినీల్?" స్వామి అడుగు తున్నాడు.

"ప్రొద్దున్న పూటేమో మా తెలుగు తల్లికి మంగళారతులు. సాయంత్రం పూటేమో జనగణమణ ..... "

"నీకు పూర్తిగా వచ్చా?"

"ఓ! పూర్తిగా వచ్చు అంకుల్ ..... "

"పాడు చూద్దాం ..... "

"జనగణమణ అధినాయక జయహే ..... " ఆ కుర్రవాడి కంఠంనిండా ఆర్తి. పూర్తిగా పాడితే అందర్నీ వదిలేస్తారేమో అన్న ఆశ . ఊపిరితిత్తుల నిండా బలంగా గాలి నింపుకుని స్వరం హెచ్చించి పాట పూర్తిచేశాడు.

జనగణమంగళ దాయక జయహే

భారత భాగ్య విధాతా .....

జయహే జయహే జయహే జయహే

జయ ..... జయ ..... జ ..... య ..... జ ..... య ..... హే-------’’’

తెల్లపావురాలు గుంపులా లేచినట్టు --- వాతావరణం చెదిరిపోయేలా ప్రకృతి చెదిరిపోయేలా పిస్టల్ పేలిన శబ్దం

ఆకాశం రోదించడం ప్రారంభించింది. మేఘాలు కరగడం మొదలైంది.

* * * * * * *

“అసెంబ్లీ ముందు బాలుడి శవం”

ఈ వార్త తెలియగానే కంట్రోలు రూమ్ దగ్గర వున్న తల్లిదండ్రుల్లో కలవరం చెలరేగింది. ప్రవాహంలా అక్కడికి చేరుకున్నారు.

తుపాకిగుండు తగిలి నేలకూలిన హంసలా రోడ్డు పక్కన పడి వున్నాడు వినీల్. వాడిచుట్టూ రక్తం వర్షంతోపాటు మడుగుకట్టింది. వాడి తల్లి గుండెలు పగిలేలా ఏడుస్తోంది.

సునాదమాల విద్యుద్ఘాతం తగిలిన దానిలా అచేతనమగా నిలబడి వుంది. వృద్ధ్యాప్యాన్ని కూడా లెక్క చెయ్యకుండ బామ్మ అయిదారు గంటల్నుంచీ అలాగే అక్కడే నిలబడి వుంది. నేల ఈనినట్టు జనం. కంట్రోలు చేయటం కష్టమవుతోంది. విలేఖర్లు ఫోటోలు తీసుకుంటున్నారు. ప్రతి వారికి అక్కడ పడివున్న బాలుడి శవం తమ పిల్లాడి శరీరం లాగే కనపడుతోంది.

పోలుసులు తమ నిస్సహాయతకు నిదర్శనగా పడివున్న ఆ బాలుడి శవాన్ని చూసి సిగ్గుతో తల వంచుకున్నారు.

చీకటి పడింది. ఎవరూ అసెంబ్లీ ముందునుంచి కదలటం లేదు. జనం కామెంట్స్ చేస్తున్నారు. పిల్లల తల్లిదండ్రుల్లో అలజడి, ఆవేశం ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వం నుంచి దీనికి పరిష్కారం వెంటనే ఆశిస్తున్నారు వాళ్ళు. ప్రభుత్వం మాత్రం ఏం చెయ్యగలదు? పాతికమంది పిల్లల్ని బంధించి బెదిరిస్తే ఒక సుస్థిరమైన ప్రభుత్వం దిగిపోవలసి వస్తే ఇక రాష్ట్రంలో శాంతిభద్రతలకి చోటెక్కడ వుంటుంది? టెర్రరిస్టులు మరింత విజృంభిస్తారు. ఇదొక మార్గం అయిపోతుంది వాళ్ళకి.

ముఖ్యమంత్రి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రివర్గ సభ్యులు రకరకాల భిన్నాభిప్రాయాలు వెలిబుచ్చారు.

మరుసటిరోజు పేపర్లలో మొదటి పేజీలో ఆ ఫోటో పడింది.

అసెంబ్లీ ముందు ముడుచుకు పడివున్న బాలుడిశవం! హృదయ విదారకంగా ఏడుస్తూన్న తల్లి ఫోటో .....

గంట తిరిగేసరికల్లా రాష్ట్రమంతా పాకిపోయింది ఈ వార్త.

ప్రజల్లో కలవరం!!

అధికార వర్గాల్లో కలవరం!!

ఎంతమంది పిల్లల్ని ఇలా బలిపెడతాడు ముఖ్యమంత్రి? ఎందుకంత టెన్షన్? పోని రాజీనామా చెయ్యకూడదూ .... ?

విత్తనంలా ప్రారంభమైన ఈ భావం అన్ని వర్గాల్లో అంకురమై క్రమంగా చెట్టులా మారింది. ప్రజాభిప్రాయం మార్చటం ఎంత సేపు?

సాయంత్రమయ్యేసరికి మరో శవం తయారవుతుందా? ఈ ఆలోచననే ప్రజలు భరించలేకపోతున్నారు.

ఆ నరురూప రాక్షసులు వార్నింగ్ కూడ ఇవ్వటం లేదు. సంప్రదింపులు జరపటంలేదు. ఇరవై అయిదు రోజులపాటు రోజుకొక కుర్రవాణ్ణి చొప్పున చంపుతామని దృఢ నిశ్చయంతో వున్నారు. ఆ నమ్మకాన్ని ప్రజల్లో కలిగించారు.

పత్రికా సంపాదకీయాల్లో కూడ నిన్న వున్నంత పట్టుదల లేదు. ముఖ్యమంత్రి ఏదో చెయ్యాలన్న అభిప్రాయాన్ని నెమ్మదిగా సూచించాయి. అలా కాకుండా ఏ మాత్రం అటూ ఇటుగా వ్రాసినా ప్రజాగ్రహానికి లోనుకాక తప్పదు.

'ఇంకో ఇద్దరు మరణించే వరకు చూద్దాం" అని వ్రాస్తే పేపరు వాళ్లు తగలబడిపోతాయి. ఏ పత్రికైనా బ్రతికేది ప్రజల మీద! విలేఖర్లు మాత్రం ఏం చేస్తారు?

నిన్నటివరకూ ముఖ్యమంత్రి పట్ల సానుభూతితో, దీన్ని ఎలా అయినా ఎదుర్కోవాలని సలహా ఇచ్చినవారే, ఇప్పుడు కాస్త వెనుకాడుతున్నారు. విమానాన్ని హైజాక్ చేసినవాడు కూడ అవతలివారు ఆలోచించుకోవటానికి కాస్త టైమిస్తాడు. వీళ్ళు అదీ చేయటంలేదు. తమ లక్ష్యం తప్ప మిగతా దారులు మూసేశారు. BALL IS IN YOUR COURT అన్న అభిప్రాయాన్ని కలుగచేశారు.

అధికార పక్షం ఇరుకున పడింది.

* * *

విసుగ్గా వుంది ప్రవల్లికకి. ఇరిటేటింట్‌గా వుంది.

ఏం చెయ్యాలో అర్థంకావటం లేదు. చీఫ్ అర్జెంటు పని అని ఢిల్లీలో వున్నాడు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా ఇరుకున పడటం ఎవరికి సంతోషం? బ్లడీ పోలిటిక్స్ .....

సాయంత్రం అవుతూంటేనే భయంగా వుంది ఆమెకి. మరో అమాయక బాలుడి శవం ఎదురు చూస్తున్నట్లు వుంది. ప్రతిపక్షాలు అప్పుడే బంద్‌కి పిలుపు నిచ్చాయి. అన్నిటికన్నా ముఖ్యంగా ఆ పిల్లల తల్లి దండ్రులు చేసే గొడవ హృదయ విదారకంగా వుంది. వారి అలుసు తీసుకుని సంఘ విద్రోహులు చెలరేగితే కష్టం. ఈ పరిస్థితుల్లో పోలీస్ కమీషనర్ లాఠీ చార్జికి ఆర్డరిచ్చినా -- వెల్లువలా తిరగబడ్తారు ప్రజలు. అసలే పోలీసుల మీద సానుభూతి అంతంత మాత్రం?

కంట్రోల్ రూమ్ ఎదురుగా జనం గుంపులు గుంపులుగా వున్నారు.

దాదాపు ఇరవై నాలుగ్గంటల్నుంచి తరువాత వంతు ఎవరిదీ అన్నట్టు బిక్క మొహాల్తో నిలబడిన తల్లిదండ్రుల్ని చూస్తూంటే ఆమెకి బాధగానూ, విచారంగానూ వుంది.